వధూవరులకు పట్టువస్త్రాలు పెడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

అధికారులే అమ్మానాన్నలు

- ప్రజాప్రతినిధులే ప్రత్యేక అతిథులు
- కళాభారతి వేదికగా అనాథ యువతి కల్యాణం
- అన్నీ తామై వివాహం జరిపించిన స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు

కలెక్టరేట్, మార్చి 9: అనాథ యువతికి అధికారులు, ప్రజాప్రతినిధులే అమ్మానాన్నల య్యారు. చిరుప్రాయంలోనే బాలసదనానికి చేరి సిబ్బంది సంరక్షణలో పెరిగి, పెళ్లీడుకొచ్చిన యువతికి మేమున్నామంటూ కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెండ్లి పెద్దలై కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కళాభవన్ వేదికగా అంగరంగవైభవంగా వివాహాన్ని జరిపించారు. వివరాల్లోకి వెళితే.. తల్లిదండ్రులు లేని మౌనిక 2017లో బాలసదనంలో చేరింది. ఆమెకు అధికారులే చదువు చెప్పించి, ఆలనాపాలనా చూశారు. ఇంటర్మీడియట్ అనంతరం ఎంపీ హెచ్‌డబ్ల్యూ కోర్సు చేసి ఇంటర్న్‌షిప్ చేస్తుండగా, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సాయి తేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయాన్ని యువతి అధికారులకు చెప్పడంతో వారు ఆ యువకుడు, కుటుంబసభ్యులతో మాట్లాడి పెళ్లి నిశ్చయించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అతిథులకు భోజనం ఏర్పాటు చేశారు. కలెక్టర్, జిల్లా జడ్జి, అధికారులు, టీఎన్జీవో నాయకులు తమవంతు సహాయ సహకారాలు అందజేయడంతో మౌనిక వివాహం అత్యంత ఘనంగా జరిపించారు.

సైబర్ నేరాల్లో రూ.43.31 కోట్ల రీఫండ్

- వివిధ కేసుల్లో 4,961 మంది బాధితులకు ఊరట
- వివరాలు వెల్లడించిన టీజీసీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో రికార్డు సొంతం చేసుకుంది. నమోదైన 4,961 సైబర్ కేసులలో దర్యాప్తు జరిపి బాధితులకు రూ.43.31 కోట్లు రీఫండ్ చేశామని టీజీసీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. నిరుడు డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 4,893 కేసులలో రూ.33.2 కోట్లను బాధితులకు అందించగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆ రికార్డును అధిగమించామని వెల్లడించారు. ఫ్రీజ్ చేసిన నగదును బాధితులకు అందించడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. సైబర్‌నేరాలపై 1930 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

పరిధి	కేసులు	రీఫండ్
హైదరాబాద్	510	రూ.12,36,32,267
రాచకొండ	747	రూ.9,38,38,161
సైబరాబాద్	1,331	రూ.9,26,98,960
నిజామాబాద్	250	రూ.1,09,19,654
సీఎస్‌బీ	116	రూ.3,95,22,664



నకిలీ పత్తివిత్తనాల విక్రేతల అరెస్ట్

- 745 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం, ఆటో సీజ్
- ప్రధాన నిందితుడిపై గతంలోనూ పోలీస్ కేసులు

మంచిర్యాల జిల్లా సుర్జాపూర్‌లో పట్టుకున్న నకిలీ విత్తనాలు, నిందితులతో పోలీసులు

దుండిగల్, మార్చి 9: నకిలీపత్తి విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముఠా సభ్యులను బాచుపల్లి, ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కర్నూలు జిల్లా, జంజర్లకు చెందిన ఆలూరి మాదన్నకు తన గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో పత్తి పండించాడు. పత్తిని కర్ణాటక రాష్ట్రం గజేంద్రగాడాలోని జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్లి విత్తనాలను, పత్తిని వేరుచేయించాడు. ఈ విత్తనాలకు రంగులు కలిపి అధిక ధరకు విక్రయించేందుకు మల్లంపేట వ్యవసాయ విత్తనాల విక్రయ కేంద్రంలో విక్రయించేందుకు ఆదివారం వస్తున్నట్టు కుత్బుల్లాపూర్ వ్యవసాయ అధికారితో పాటు ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం పోలీసులు బాచుపల్లి-మల్లంపేట రోడ్డులో నిఘాపెట్టగా మల్లంపేట నుంచి బాచుపల్లి వైపు ఓ ట్రాలీ ఆటో అనుమానాస్పదంగా వస్తుండడంతో తనిఖీ చేయగా 15 బస్తాల పత్తి విత్తనాల సంచులు లభించాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మాదన్నతోపాటు, ఆటో డ్రైవర్ చావిట్ల ఆదర్శ్, మరో రైతు గొల్ల ఉదయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. పత్తి విత్తనాలకు రంగులు కలిపి మార్కెట్‌లో విక్రయించేందుకు వచ్చినట్టు తేలడంతో 745 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశారు. కుత్బుల్లాపూర్ వ్యవసాయ అధికారి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు మాదన్నను యాలాల్ పోలీసులు గతంలోనూ అరెస్టు చేసినట్టు తేలింది. ఆటో డ్రైవర్ ఉదయ్ కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లికి చెందినవారిగా గుర్తించారు.

మంచిర్యాల జిల్లాలో 140 కిలోలు..

కన్నెపల్లి, మార్చి 9 : మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం సుర్జాపూర్‌లోని బేరి నారాయణ ఇంట్లో తనిఖీలు చేయగా, 140 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డట్టు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ గంగారాం, వ్యవసాయాధికారి సాయిప్రశాంత్ సూర్జాపూర్‌లో తనిఖీలు నిర్వహించగా, నారాయణ ఇంట్లో రూ. 3.50 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు లభించినట్టు పేర్కొన్నారు. కొండగుర్ల రాజన్న, సురేశ్ వద్ద బేరి నారాయణ ఈ నకిలీ విత్తనాలు తీసుకున్నట్టు తెలిపారు. నకిలీ విత్తనాలతో పాటు నారాయణ, రాజన్నను అదుపులోకి తీసుకున్నామని, సురేశ్ పరారీలో ఉన్నారని చెప్పారు.

బదిలీ హెచ్ఎంలకు జడ్పీ జీపీఎఫ్ కష్టాలు

- సబ్‌స్క్రిప్షన్ నంబర్ కేటాయింపులో జాప్యం
- పట్టించుకోని అధికారులు.. ప్రధానోపాధ్యాయుల ఆందోళన

హైదరాబాద్, మార్చి 9 (నమస్తేతెలంగాణ): ఉద్యోగోన్నతిపై పక్క జిల్లాలకు బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులకు సంబంధించి జడ్పీ జీపీఎఫ్ ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌స్క్రిప్షన్ నంబర్ కేటాయింపులో జాప్యం జరుగుతుండడంతో నగదు జమకాక అష్టకష్టాలు పడుతున్నారు. డీఏ ఏరియర్స్ ఏ ఖాతాలో జమచేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు..

2023 సెప్టెంబర్‌లో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. సొంత జిల్లాల్లో ఖాళీలు లేకపోవడంతో వందలాది మందిని పక్క జిల్లాలకు ట్రాన్స్‌ఫర్‌పై పంపించారు. వీరు జీపీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ నంబర్‌ను పూర్వపు జిల్లాల నుంచి బదిలీ చేయాలని దరఖాస్తు చేశారు. గతంలో జీపీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ నంబర్ ఖాతాలోని నగదు, సంబంధించిన వడ్డీని ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేయాల్సి ఉంటుంది. కానీ ఏడాదిన్నర దాటినా అధికారులు వీరి సబ్‌స్క్రిప్షన్ నంబర్‌ను బదిలీ చేయడంలేదు. ఉపాధ్యాయ సంఘాల ద్వారా అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని హెడ్మాస్టార్లు ఆరోపిస్తున్నారు. దీంతో మూల వేతనంపై చెల్లించాల్సిన 6% సబ్‌స్క్రిప్షన్ నగదు చెల్లింపులు జరగడంలేదని పేర్కొంటున్నారు. డీఏ మంజూరైన సందర్భంలో వచ్చే ఏరియర్స్‌ను ఎందులో జమచేయాలో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా జడ్పీ జీపీఎఫ్ కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

- ఎస్సీ వర్గీకరణతోనే నియామకాలు చేపట్టాలి
- లేదంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ఖైరతాబాద్, మార్చి 9: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగాల ప్రక్రియను చేపడుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం నుంచి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక రిలేదీక్షలు చేపడతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వెల్లడించారు. ప్రతి జిల్లా, మండల కేంద్రాలతోపాటు అన్ని యూనివర్సిటీల్లో ఈ దీక్షలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీ చేపట్టొద్దని, వెంటనే గ్రూప్స్, ఇతర ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాడే వర్గీకరణ చేశాకే ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, నేడు మాట నిలబెట్టుకోకుంటే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి గ్రూప్-1, 2, 3తో పాటు ఇతర ఉద్యోగ నియామక ఫలితాలను ఈనెల 19 వరకు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దాని వల్ల దళిత కులాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నెల 12న శాసనసభ సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత తీసుకొస్తామని సీఎం చెప్పారని.. ఆ ప్రక్రియ పూర్తికాకుండానే, ఉద్యోగాల భర్తీని ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందునరేశ్ మాదిగ, సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్ తదితరులున్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

సూర్యాపేట టౌన్, మార్చి 9 : ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు గ్రూప్ 1,2,3 పరీక్ష ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎ మ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం నిరవధిక దీక్ష చేపట్టారు.

హాస్టల్ బిల్లులను చెల్లించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టళ్ల అద్దె బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి అద్దె బకాయిలు కొన్ని నెలలుగా బకాయి ఉన్నాయని, దీంతో యాజమాన్యాలు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని వాపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని వెల్లడించారు. వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్‌టికెట్లు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): పదో తరగతి పరీక్షల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. లేదంటే సంబంధిత పాఠశాలల నుంచి పొందవచ్చని సూచించారు. ఇతర వివరాల కోసం 040-23230942 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

'సింగరేణిని వేలంలో పాల్గొననివ్వాలి'

హైదరాబాద్, మార్చి 9 (నమస్తేతెలంగాణ): కేంద్రం నిర్వహిస్తున్న బొగ్గుబ్లాక్‌ల వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు సింగరేణికి అనుమతించాలని ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఎంవోఐఏ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్‌ప్రసాద్, లక్ష్మీపతి గౌడ్ డిమాండ్ చేశారు. బొగ్గుబావులు దక్కకుంటే కంపెనీ మూతపడి, కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో కీలకభూమిక పోషిస్తున్న సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు.

రాజడి

రేపటి కోసం ప్లాన్ ఎలా?

ఎన్‌పీఎస్ వివరాలు తెలుసా..

రిటైర్మెంట్‌తో మీకు అందే ఆదాయానికి తెరపడ్డట్టే. రోజువారీ అవసరాలకు కూడా నానా ఇబ్బందులు తలెత్తుతాయంటే అతిశయోక్తి కాదు. ఇలాంటప్పుడే ప్లానింగ్ విలువ తెలిసేది. రిటైర్మెంట్ కోసం చక్కని ప్రణాళికల్ని వేసుకొనేవారికి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ప్రధానమని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వచ్ఛంధ పథకం విషయానికొస్తే..

టైర్ 1 అకౌంట్

రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం టైర్ 1 అకౌంట్ ప్రధానం. పూర్తిస్థాయిలో ఎన్‌పీఎస్, పన్ను ప్రయోజనాలను అందుకోవాలంటే ఇది అవసరం.

కనీస విరాళాలు

కనీస ప్రారంభ విరాళం రూ.500. ఆ తర్వాత ప్రతీ ఆర్థిక సంవత్సరం కనీస విరాళం రూ.1,000.

పన్ను ప్రయోజనాలు

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీసీడీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల దాకా పన్ను ప్రయోజనాలను పొందవచ్చు. అదనంగా సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద మరో రూ.50వేలు క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ(2) కింద అదనపు కోతల ద్వారా కార్పొరేట్ ఉద్యోగులూ లాభం పొందవచ్చు.

లాకిన్ పీరియడ్

టైర్ 1 ఖాతాలో ఖాతాదారునికి 60 ఏండ్లు వచ్చేదాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే 60 శాతం నిధిని పన్ను లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగతా 40 శాతం నిధిని రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ కోసం యాన్యుటీని కొనాల్సి ఉంటుంది.

టైర్ 2 అకౌంట్

ఇది వాలంటరీ సేవింగ్స్ అకౌంట్. దీనికి ఎలాంటి పన్ను ప్రయోజనాలు వర్తించవు. అయితే రిటైర్మెంట్‌కు ముందే ఫండ్స్‌ను విత్‌డ్రా చేసుకోవాలనుకొనేవారికి ఇది ఉపయోగకరం.

కనీస విరాళాలు: రూ.1,000. మీడియం టర్మ్ సేవింగ్స్, ఎమర్జన్సీలకు మంచి అవకాశం. టైర్ 2 అకౌంట్‌ను తెరవాలంటే టైర్ 1 ఖాతాను తీసుకోవాలి. కాగా, టైర్ 1, 2 ఖాతాలు సింగిల్ పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్)కు లింకై ఉంటాయి.

పోస్టల్ ఇన్సూరెన్స్ భళా

గ్రాడ్యుయేట్లకూ పీఎల్ఐ అవకాశం

జీవిత బీమా ఆకర్షణీయ రాబడులనూ అందిస్తే బాగుంటుంది కదూ. మనకు, మన కుటుంబ సభ్యులకు బీమా ధీమాతోపాటు చక్కని ఆర్థిక ప్రయోజనాలూ అందితే అంతకన్నా ఇంకేం కావాలి మరి. అయితే ఇలాంటి బెనిఫిట్స్, ఫీచర్లతోనే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) అందుబాటులో ఉన్నది. ఇదేదో నిన్నమొన్న పరిచయమైనది కాదు.. 141 ఏండ్ల చరిత్ర ఉన్నదీ బీమాకు. నిజానికి ఆరంభంలో తపాలా శాఖ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఓ సంక్షేమ పథకంగా మొదలైన పీఎల్ఐని.. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు, భద్రతా సిబ్బందికి, సర్కారీ సంస్థల్లో కొలువులు చేస్తున్నవారికి వర్తింపజేశారు. కాలక్రమేణా వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏల వంటి ప్రొఫెషనల్స్‌తో పాటు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదైన కంపెనీల ఉద్యోగులకూ అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల గ్రాడ్యుయేట్లకూ పీఎల్ఐ సౌకర్యాన్ని పొడిగించారు. ఇక ఈ బీమాలోని పథకాల విషయానికొస్తే..

యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అస్యూరెన్స్ (సుమంగళ్)

- ఇదో మనీబ్యాక్ పాలసీ
- 19-45 ఏండ్లవారు అర్హులు
- పాలసీ కాలపరిమితి 15-20 ఏండ్లు
- 15 ఏండ్ల పాలసీపై 6, 9, 12 ఏండ్లు పూర్తయితే 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం బోనస్
- 20 ఏండ్ల పాలసీపై 8, 12, 16 ఏండ్లు పూర్తయితే 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం బోనస్
- ఏటా ప్రతీ వెయ్యికి రూ.48 చొప్పున బోనస్ లభిస్తుంది

హోల్ లైఫ్ అస్యూరెన్స్ (సురక్ష)

- 19-55 ఏండ్లవారు అర్హులు
- బీమా రూ.20వేలు-రూ.50 లక్షలు
- ప్రీమియంలు చెల్లించే వయసును 55, 58, 60 ఏండ్లుగా ఎంచుకోవచ్చు
- పాలసీ తీసుకున్న నాలుగేండ్ల తర్వాత రుణ సదుపాయం
- మూడేండ్లు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం
- ఐదేండ్లలోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు
- ఐదేండ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌ల్లో కోత
- ఏటా ప్రతీ వెయ్యికి రూ.76 చొప్పున బోనస్ లభిస్తుంది
- పాలసీదారుకు 59 ఏండ్లదాకా ఈ స్కీమ్‌ను ఎండోమెంట్ అస్యూరెన్స్ పాలసీలోకి మార్చుకోవడానికి వీలుంటుంది
- పాలసీదారుకు 80 ఏండ్లు దాటితే లేదా పాలసీదారు చనిపోతే వారి వారసులకు బీమా సొమ్ము, దానిపై బోనస్ ప్రయోజనాన్ని చెల్లిస్తారు

కన్వర్టబుల్ హోల్ లైఫ్ అస్యూరెన్స్ (సువిధ)

- 19-50 ఏండ్లవారు అర్హులు
- కనీస బీమా రూ.20వేలు, గరిష్ఠ బీమా రూ.50 లక్షలు
- పాలసీ తీసుకున్న నాలుగేండ్ల తర్వాత రుణ సదుపాయం
- మూడేండ్లు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం
- ఐదేండ్లలోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు
- ఐదేండ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌ల్లో కోత
- ఏటా ప్రతీ వెయ్యికి రూ.76 చొప్పున బోనస్ లభిస్తుంది
- ఐదేండ్ల తర్వాత (ఆరేండ్లు దాటరాదు) ఎండోమెంట్ అస్యూరెన్స్ స్కీమ్‌లోకి మారవచ్చు. అప్పుడు బోనస్‌లూ అదే పద్ధతిలో లభిస్తాయి. అయితే కన్వర్షన్ లేకపోతే హోల్ లైఫ్ అస్యూరెన్స్‌గా పరిగణిస్తారు

ఎండోమెంట్ అస్యూరెన్స్ (సంతోష్)

- 19-55 ఏండ్లవారు అర్హులు
- కనీస బీమా రూ.20వేలు, గరిష్ఠ బీమా రూ.50 లక్షలు
- పాలసీ తీసుకున్న మూడేండ్ల తర్వాత రుణ సదుపాయం
- మూడేండ్లు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం
- ఐదేండ్లలోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు
- ఐదేండ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌ల్లో కోత
- ఏటా ప్రతీ వెయ్యికి రూ.52 చొప్పున బోనస్ లభిస్తుంది

జాయింట్ లైఫ్ అస్యూరెన్స్ (యుగళ్ సురక్ష)

- 21-45 ఏండ్ల దంపతులు అర్హులు
- కనీస బీమా రూ.20వేలు, గరిష్ఠ బీమా రూ.50 లక్షలు
- పాలసీ కాలపరిమితి 5-20 ఏండ్లు
- పాలసీ తీసుకున్న మూడేండ్ల తర్వాత రుణ సదుపాయం
- మూడేండ్లు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం
- ఐదేండ్లలోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు
- ఐదేండ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌ల్లో కోత
- మరణానంతర ప్రయోజనాలు భాగస్వామికి అందుతాయి. లేదా వారి వారసులకు వెళ్తాయి
- ఏటా ప్రతీ వెయ్యికి రూ.52 చొప్పున బోనస్ లభిస్తుంది
- సింగిల్ ప్రీమియంతో భార్యాభర్తల బీమా కవరేజీని పొడిగించుకోవచ్చు

చిల్డ్రెన్ పాలసీ (బాల్ జీవన్ బీమా)

- పాలసీదారుల పిల్లల కోసమే ఈ పథకాన్ని తీసుకొచ్చారు.
- గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు బీమా చేసుకొనే వెసులుబాటును కల్పించారు.
- పిల్లల వయసు తప్పనిసరిగా 5 నుంచి 20 ఏండ్ల మధ్య ఉండాలి
- పిల్లలకు గరిష్ఠంగా రూ.3 లక్షలు లేదా పాలసీదారు బీమా (సమ్ అస్యూర్డ్) ప్రకారం (ఏది తక్కువైతే అది) ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు
- పాలసీదారు (పిల్లల తండ్రి) వయసు 45 ఏండ్లు దాటరాదు
- పాలసీదారు చనిపోతే పిల్లలపై తీసుకున్న బీమాకు ప్రీమియంలు చెల్లించనక్కర్లేదు. కాలపరిమితి తీరాక బీమా సొమ్ము, బోనస్‌లు వస్తాయి
- రుణ సదుపాయం, సరెండర్ సౌకర్యం ఉండవు. ప్రీమియంలు తల్లిదండ్రులే చెల్లించాలి
- పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి. అయినప్పటికీ వీరికి ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించరు
- ఎండోమెంట్ పాలసీ ప్రకారం బోనస్‌లు వర్తిస్తాయి

పాలసీదారులు గుర్తుంచుకోండి

ఎంత చిన్న వయసులో బీమా తీసుకుంటే అంత తక్కువగా ప్రీమియంలు, ఎక్కువగా ప్రయోజనాలుంటాయన్నది మరువద్దు. ఇక పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలనుకొనేవారు కావాల్సిన పత్రాలను విధిగా సంబంధిత అధికారులకు సమర్పించాలి. గ్రాడ్యుయేట్లు తమ పదో తరగతి, డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే పాలసీనిబట్టి వివిధ వైద్య పరీక్షలూ ఉంటాయి. గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా ఉన్నది. దీనికి గ్రామీణులు అర్హులు. అందులోనూ ఇలాగే రకరకాల స్కీములుంటాయి. ఆయా నిబంధనలూ వర్తిస్తాయి. మరిన్ని వివరాల కోసం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పోస్ట్‌ఇన్ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదా సమీప పోస్టాఫీస్‌ను సంప్రదించవచ్చు. అలాగే https://www.indiapost.gov.inను లాగిన్ కావచ్చు.

టారిఫ్ భయాలను దాటుకొని..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకున్నాయి. వరుస నష్టాల నుంచి గత వారం లాభాలబాట పట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. మదుపరులను అమ్మకాల ఒత్తిడిలోకి నెడుతున్న విషయం తెలిసిందే. దీంతో సూచీలు భారీగా పడిపోతూ వచ్చాయి. అయితే గత వారం ఈ ధోరణికి విరామం ఇచ్చారు మదుపరులు. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,134.48 పాయింట్లు లేదా 1.55 శాతం పుంజుకొని 74,332.58 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 427.80 పాయింట్లు లేదా 1.93 శాతం అందుకొని 22,552.50 దగ్గర ముగిసింది. యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, మెటల్, టెలికం, కమోడిటీస్, చమురు-గ్యాస్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్ రంగాల షేర్లు ఆకర్షణీయంగా కనిపించడంతో ట్రంప్ టారిఫ్ భయాలను ఇన్వెస్టర్లు అధిగమించగలిగారు. ఈ క్రమంలో ఈ వారం కూడా మార్కెట్లకు పెట్టుబడుల మద్దతు లభించవచ్చన్న అంచనాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కోలుకుంటే మార్కెట్ సెంటిమెంట్ మరింతగా బలపడే వీలున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,100 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 22,900-23,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడుదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.